క్లుప్తంగా

'పైపులైన్లు తొలగించాలి'

నక్కపల్లి : వ్యర్థ రసాయనాలను సముద్రంలోకి విడుదల చేసేందుకు హెటిరో కంపెనీ ఏర్పాటు చేసిన పైపులైన్లను తక్షణమే తొలగించాలని, భవిష్యత్‌లో ఎప్పుడూ పైపులైన్లు వేయడానికి అనుమతి ఇవ్వకూడదని సీబీఐ మాజీ జాయింట్ డైరక్టర్ జేడీ లక్ష్మినారాయణ డిమాండ్ చేశారు. పైపులైన్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా రాజయ్యపేట, దొండవాక మత్స్యకారులు రాజయ్యపేటలో ఏడాది నుంచి చేస్తున్న నిరాహార దీక్షలకు(మహాశాంతి ధర్నా) మద్దతుగా ఆయన దీక్షాశిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్బంగా మత్స్యకార నాయకులు పిక్కిస్వామి, గోసల స్వామి, సతీష్ తదితరులు పైపులైన్ల సమస్యను లక్ష్మినారాయణకు వివరించగా ఆయన పై విధంగా స్పందించారు.

జగనన్న ఇళ్ల పనులు వేగవంతం కావాలి


మాట్లాడుతున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక : జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాంగ్రేగుల నూకరాజు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం గ్రామ సభలు జరిగాయి. వాడ్రాపల్లి సచివాలయంలో జరిగిన గ్రామసభలో నూకరాజు మాట్లాడుతూ వాడ్రాపల్లి గ్రామానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అధికారులు, వలంటీర్లు గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. అలాగే ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టనున్న పలు పనులకు ఈ సందర్భం తీర్మానం చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి సమావేశంలో పాల్గొన్నారు.

పూడిమడకలో జిమ్ ప్రారంభం


జిమ్‌ను ప్రారంభించిన ఎస్‌ఐ సన్యాసినాయుడు

అచ్యుతాపురం(అనకాపల్లి): యువత వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అచ్యుతాపురం ఎస్‌ఐ సన్యాసినాయుడు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో నూతన జిమ్‌ను ఆయన సోమవారం ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పోలవరపు పారునాయుడు, జగన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


రామన్నపాలెంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): రామన్నపాలెంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. పింఛను సొమ్ము రూ.250 పెంచడం పట్ల వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ లాలం శ్రీను, సచివాలయం కన్వీనర్ డి.నాయుడు బాబు, వైస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకటస్వామి నాయుడు, డి.చినబాబు, ప్రసాద్, కొత్తయ్య, సుబ్రమణ్యం, సురేష్, చిన అప్పలనాయుడు పాల్గొన్నారు.

పాండవుని కొండపై వెంకన్న నామాల ఏర్పాటు


పాండవుల కొండపై ఏర్పాటు చేసిన వెంకటేశ్వరుని నామాలు

మునగపాక : తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిలో పాండవుల కొండపై సోమవారం వేంకటేశ్వరుని నామాలను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన దాడి అప్పారావు ఆర్థిక సహకారంతో రూ.70వేలతో ఈ నామాలు ఏర్పాటు చేశారు. సోలార్ లైటింగ్ ద్వారా 150 బ్యాటరీ సోలార్ ప్లేట్లు, ఇన్‌వర్టర్ సదుపాయం కల్పించారు. 10 అడుగుల ఎత్తు,8 అడుగుల వెడల్పుతో కూడిన వేంకటేశ్వరుని నామాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

- ఉత్తర ద్వార దర్శనానికి
- ఆలయాల్లో బారులు తీరిన భక్తులు

ఎస్.రాయవరం : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాలయాలు కిటకిటలాడాయి. దార్లపూడి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, ఎస్.రాయవరం శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి, వమ్మవరం శ్రీ స్వయంభూ వేంకటేశ్వరస్వామి, కొరుప్రోలు శ్రీ సీతారామస్వామి ఆలయాల్లో స్వామి ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. భక్తులు వేకువ జామునుంచి క్యూ కట్టారు.

రామగిరి, పాటిపల్లిలో గిరి ప్రదక్షిణలు

మునగపాక: నాగులాపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. పాటిపల్లిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ స్వామివారిని దర్శించుకున్నారు. చూచుకొండ దళితవాడలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించారు. అన్న సమారాధన నిర్వహించారు. రామగిరి, పాటిపల్లిలలో గిరి ప్రదక్షిణలు నిర్వహించారు.

కోటవురట్ల : ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాలలో భక్తుల తాకిడి నెలకొంది. వేకువ జామునే ఆలయాలకు చేరుకున్న భక్తులు విశేష పూజలు చేశారు. కైలాసపట్నంలోని శ్రీ రాజగోపాల స్వామి ఆలయం, కోటవురట్లలోని శ్రీ ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయం, చిన లింగాపురంలోని శ్రీ దుర్గా మల్లేశ్వర అయ్యప్ప ఆలయం, యండపల్లి శివారున శ్రీ ఆత్మలింగేశ్వస్వామి ఆలయాలలో భక్తులు ముక్కోటి ఏకాదశి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు.

సీతారామమందిరంలో లక్ష తులసి పూజ

పాయకరావుపేట : నామవరంలో సీతారామ ఆలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం గ్రామపెద్దల సహకారంతో లక్ష తులసి పూజ జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించి లక్ష తులసి దళాలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం తిలకించేందుకు గ్రామం నుంచి భక్తులు తరలివచ్చారు.


పాటిపల్లిలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్


నామవరంలో స్వామివారికి లక్ష తులసి పూజ నిర్వహించిన దృశ్యం


అచ్యుతాపురం కల్యాణ వేంకటేశ్వర స్వామివారు


పాయకరావుపేటలో పాండురంగ ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు భక్తుల పూజలు

అచ్యుతాపురం(అనకాపల్లి) : వైకుంఠ ఏకాదశి సందర్భంగా అచ్యుతాపురం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయ పరిసరాలను పూలతో అలంకరించారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం జరిపారు. రాత్రి విద్యుదలంకరణతో ఆలయం ప్రకాశించింది. ఆలయ యూర్మన్ లక్ష్మణ రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : పట్టణంలో గల శ్రీరాధా రుక్మిణీ సహిత పాండురంగ స్వామి దేవస్థానం, రాజుగారిబీడు వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలోను భక్తులు ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలను పూలతోను, విద్యుత్ దీపాలతోను సుందరంగా అలంకరించారు. మంగవరం, రాజగోపాలపురం, పాల్తేరు గ్రామాల్లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు స్వామిని ఉత్తర ద్వార దర్శనాలు చేసుకున్నారు.

రాంబిల్లి : ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం రాంబిల్లి, వెంకయ్యపాలెంలో వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దిమిలిలో వల్లభనారాయణస్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్తర ద్వారం ద్వారా భక్తులు ఆలయంలోకి ప్రవేశం కల్పించారు.


పూలదండలతో అలంకరించిన పాండురంగస్వామి ఆలయం


దిమిలిలో వల్లభనారాయణస్వామి


రాంబిల్లిలో వేంకటేశ్వరస్వామి

భక్తులతో పోటెత్తిన ఉపమాక


ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తున్న మూలవిరాట్


కోలాటం ఆడుతున్న మహిళలు

నక్కపల్లి : వైకుంఠ ఏకాదశి (ముక్కోటిఏకాదశి) సందర్భంగా సోమవారం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. గరుడాద్రిపై వెలసినస్వామి వారిని ముక్తిమార్గం (వైకుంఠద్వారం)ద్వారా దర్శించుకున్నారు. ఉదయం 3 గంటలకు గరుడాద్రిపై వెలసిన మూలవిరాట్‌కు ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చకులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో తొలి అభిషేకం నిర్వహించారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మినారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోటనగేష్, కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు తదితర ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉపమాక శ్రీనివాస భజన బందం, వివి ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు వాహనాల ముందు కోలాటం, భజన గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులుగొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు,శేషాచార్యులు,రాజగోపాలాచార్యులు, రామగోపాలాచార్యులు పాల్గొన్నారు.

ఉపమాకలో ఆకట్టుకున్న శోభాయాత్ర

నక్కపల్లి : ముక్కోటి ఏకాదశిను పురస్కరించుకుని సోమవారం మండలంలో చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సుమారు 500 మంది భక్తులు జాతీయ రహదారిపై చినదొడ్డిగల్లు నుంచి ఉపమాక వరకు సుమారు 10 కిలోమీటర్లు శోభాయాత్ర నిర్వహించారు. నెలగంట ప్రారంభం నుంచి గ్రామంలో మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ముక్కోటి ఏకాదశినాడు ప్రత్యేకంగా పల్లకీలో శ్రీదేవీ, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని, స్వామివారి పాదుకలను ఉంచి భజనలు చేస్తూ భక్తి గీతాలు ఆలపిస్తూ ఊరేగింపుగా ఉపమాక వేంకటేశ్వర స్వామివారి పుణ్యక్షేత్రానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

యాత్రను వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీ తోటసత్తిబాబు, మాజీ సర్పంచ్ వెలగా శ్రీనివాసరావు, దావీదురాజు, సుధాకర్, లక్ష్మణ రావు తదితరులు పర్యవేక్షించారు. నక్కపల్లి వద్ద కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోటనగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు కొప్పిశెట్టి బుజ్జి, మీగడ సత్తిబాబు స్వాగతం పలికారు.

ఉద్దండపురం నుంచి కూడా 80 మంది భక్తులు 12 కిలోమీటర్లు శోభాయాత్ర చేసి ఉపమాక వెంకన్నను దర్శించుకున్నారు.


ఉపమాకలో శోభాయాత్రకు స్వాగతం పలుకున్న దృశ్యం


వివిధ వాహనాల్లో తిరువీధి సేవలు నిర్వహిస్తున్న దృశ్యం

అర్హులందరికీ పింఛన్లు మంజూరు


మునగపాకలో పింఛన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్ అప్పలనాయుడు


రేవుపోలవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు


మండలం నలుమూల గ్రామాల నుంచి విచ్చేసిన నూతన పింఛనుదార్లు


నూతన పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్‌లు అందజేస్తామని మునగపాక సచివాలయ కన్వీనర్, ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా పెంచిన పింఛన్ సొమ్ములో భాగంగా సోమవారం ఆయన స్థానిక వార్డు సభ్యులు బలిరెడ్డి సూరిబాబు, వలంటీర్ మహేశ్వరితో కలిసి లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకోవాలన్నారు. తద్వారా ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు

ఎస్.రాయవరం: జగనన్న సంక్షేమ పథకాలు చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు. రేవు పోలవరం గ్రామంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధి గురించి ఆరా తీశారు. ప్రతి ఇంటికీ ఒకటి నుంచి నాలుగు పథకాలు వరకు అందాయని ప్రజలు ఆనందం వ్యక్త పరచారు. గత ప్రభుత్వాల్లో ఎన్నడూ చూడని తీరుగా సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో వందల సంఖ్యలో ఇళ్లు అందిస్తున్న ఘనత కూడా సీఎం జగన్ మోహన్‌రెడ్డిదే అని కొనియాడారు. దీంతో రెట్టింపు ఉత్సాహంతో ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కోటి 12 లక్షల రూపాయలు అందించామని ఈ సందర్భంగా చెప్పారు. సర్పంచ్ మల్లే లోవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, చోడిపల్లి గోవిందు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి ధ్యేయం

పాయకరావుపేట : రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయం అని, అందుకే బడుగు, బలహీన వర్గాలవారందరికీ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్న ఉద్దేశ్యంతో నవరత్నాలు పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. పాయకారవుపేట మెయిన్‌రోడ్డు నిర్మాణం త్వరలో చేపట్టడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 12358 మందికి పింఛన్లు రాగా కొత్తగా 386 మందికి మంజూరైనవన్నారు. అటువంటి ముఖ్యమంత్రిని మరలా అందరం గెలిపించవలసి వుందన్నారు. అనంతరం కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపీపీ ఇసరపు పార్వతీ, జడ్పీటిసి లంక సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు చోడిపల్లి శ్రీను, పాయకరావుపేట గ్రామ ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ఎంపీడీవో ఎ.సాంబశివరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా...

నక్కపల్లి: ఎమ్మెల్యే పదవి శాశ్వతం కాదని, తనకు ప్రజా సేవే ముఖ్యమని, 24/7 వారంలో అన్ని రోజులు ప్రజలకు అందుబాటులోఉంటాని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. సోమవారం ఆయన నక్కపల్లి మండలపరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరయిన పింఛన్లను పంపిణీ చేశారు. నక్కపల్లి మండలానికి 409 పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గానికి 1333 పింఛన్లు మంజూరు చేశారన్నారు. లబ్దిదారులకు ఈనెలనుంచి రూ.2750 చొప్పున చెల్లించడం జరుగుతుందన్నారు. ఎన్నికల పరిశీలకుడు మాజీ ఎమ్మెల్యే చింతల పూడి వెంకటరామయ్య, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ నానాజీ, సర్పంచ్ రత్నకుమారి ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యశాస్త్రి, ఈవోపీఆర్‌డి వెంకటనారాయణ పాల్గొన్నారు.

అవ్వా, తాతలకు అండగా జగన్ ప్రభుత్వం

ఎస్.రాయవరం: అవ్వా తాతల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోయే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డియే అని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొత్తరేవుపోలవరం గ్రామంలో మండలానికి విడుదలయిన నూతన పింఛన్లు 263 మందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్ర తరువాత అవ్వాతాతలకు అండగా నిలవాలని ఆనాడు ప్రతిపక్షంలో రూ.2 వేలు పింఛను ఇస్తానని ప్రకటించారన్నారు. దిగిపోయే ముందు చంద్రబాబునాయుడు హడావిడిగా రెండు వేలు చేశారన్నారు. అయితే తాను అధికారంలోకి వస్తే విడతలవారిగా పింఛను నగదు రూ.3 వేలు వరకు పెంచుతూ ఇస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం విడతకు రూ.250 చొప్పున పెంచుతూ ఈ జనవరికి 3 దఫాలుగా పింఛను పెంచారన్నారు. ఇప్పుడు రూ.2750 వరకు పెంచిన నగదుతో పింఛను అందజేసినట్టు చెప్పారు. అంతేకాకుండా పింఛను కోసం పడిగాపులు కాయకుండా ఇంటి వద్దకే పింఛను ఇచ్చే ఏర్పాట్లు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు మాతా గురునాథరావు, సర్పంచ్‌లు మల్లే లోవరాజు, కోశెట్టి వెంకటరమణ, మైలపల్లి శ్రీనువాస్, దారబోయిన గణేష్, ఎంపీటీసీ శానాపతిరాము వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, చోడిపల్లి అప్పన్న, చల్లపల్లి సత్యనారాయణ, బోయిన లక్ష్మి, ఎస్.రాయవరం, పెనుగొల్లు పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లాడ నాగరాజు, దోసపాత్రుని హనుమంతరావు పాల్గొన్నారు.


కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ ప్రారంభించిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, చింతలపూడి వెంకటరామయ్య

18 నుంచి భరతమాత పూజలు


సమావేశంలో పాల్గొన్న ఫౌండేషన్ సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : ఈ నెల 12న వివేకానంద జయంతి, ఈ నెల 18 నుంచి 26 వరకు భరత మాత పూజలు నిర్వహించాలని సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి.రమణ అన్నారు. అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం-అందలాపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన మండల సమరసతా సేవా ఫౌండేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పౌర్ణమి రోజున ప్రతి దేవాలయంలో సామూహిక హారతి నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, భీశెట్టి దేవి, గుడివాడ రమణ, ఆడారి త్రినాథ్, పీలా శ్రీను, వెంకునాయుడు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన క్యాలండర్ ఆవిష్కరణ


యూటీఎఫ్ క్యాలండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో క్యాలండర్, డైరీ ఆవిష్కరించారు. యూటీఎఫ్ ప్రతినిధులు ఎంపీపీ భర్త కోన బుజ్జి, ఎంపీడీవో విజయలక్ష్మి, సీఐ మురళీరావు, ఎంఈవో దేవరాయలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడంతో పాటు, వారి సమక్షంలో క్యాలండర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సబ్బవరపు నూకరాజు, జిల్లా అధ్యక్షులు వత్సవాయి లక్ష్మి, జిల్లా కార్యదర్శి ప్రకాష్, మండల నాయకులు సుభాషిణీ దేవి, కె.కరుణకుమార్, పైడిరాజు, సువర్ణలత, మురళీకృష్ణ పాల్గొన్నారు.

శాకాహారంతో మెరుగైన ఆరోగ్యం

విశ్రాంత సీబీఐ డైరెక్టర్ కార్తికేయన్

మునగపాక : ప్రతి ఒక్కరూ శాకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చని విశ్రాంత సీబీఐ డైరెక్టర్ డీఆర్ కార్తికేయన్ అన్నారు. ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. నాగులాపల్లిలోని పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజులో కనీసం అర్ధగంట పాటు ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని అలాగే చదువుకునే విద్యార్థులు చురుగ్గా ఉండగలుగుతారన్నారు., తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల చదువులపై దృష్టి సారించాలన్నారు. ధ్యాన గురువు సుజాత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్తికేయన్‌ను ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో సత్కరించారు.


విశ్రాంత సీబీఐ డైరెక్టర్ కార్తికేయన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

దిమిలిలో ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

రాంబిల్లి : దిమిలిలో ఈ నెల 4న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. నూకాంబిక యువసేన ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆస్పత్రి ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనుంది. రామాలయం వద్ద ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నూకాంబిక యువసేన నాయకులు బొద్దపు మాణిక్యం, బొద్దపు శ్రీను కోరారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

రాంబిల్లి : విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ జి.శిరీష్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు అన్నారు. రాంబిల్లి కస్తూర్బా పాఠశాలలో సోమవారం 8 వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎం.సూర్యారావు పాల్గొన్నారు.


రాంబిల్లి కస్తూర్బా స్కూల్లో ట్యాబ్‌ల పంపిణీ